క్లుప్తంగా

పాఠశాల ఆకస్మిక తనిఖీ



వీకేఆర్‌వైకాలనీ ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఏఎంఓ శివశంకర్

వరదయ్యపాళెం: మండలంలోని వీకేఆర్‌వై కాలనీ ప్రాథమిక పాఠశాలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్ గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 3,4,5 తరగతులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న టీచింగ్ ఎట్ రైట్ లెవల్ (టార్లు) కార్యక్రమం గురించి ట్యాబ్‌లో వివరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల సామర్థ్యాన్ని ఆరా తీశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు మునిరాజులు పూర్తి వివరాలను ఏఎంఓకు వివరించారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాముఖ్యత



విశ్రాంత అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాముఖ్యత ఇస్తోందని డీసీసీ బ్యాంకు మేనేజర్ తేజస్వి అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం, సీడీపీఓ కార్యాలయాల్లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. రిటైర్డు అంగన్‌వాడీ కార్యకర్తలు 20 మందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం స్వర్ణలత, స్టేట్ బ్యాంకు మేనేజర్ జోసఫ్ కెనడీ, సూపర్ వైజర్లు శ్రీదేవి, సంధ్య, జ్యోతి, యమున, సీసీలు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్యులు, దివాకర్, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పేద గర్భిణులకు వైద్యాధికారులు మాధవి, వైద్యులు దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులు ఇబ్బంది పడకూడదని మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనరు, మాజీ సర్పంచ్ గురవయ్య వీరికి భోజన సదుపాయం కల్పించారు. 70 మంది పేద గర్భిణులతోపాటు వచ్చిన సహాయకులకు భోజనాన్ని అందించిన దాత గురవయ్యను వైద్య సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, పద్మకుమారి, వైద్య సిబ్బంది పద్మశ్రీ, మీనాక్షి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. సీఐ శ్రీహరి కథనం మేరకు, తిరుపతికి చెందిన రాజేష్(38), సుబ్రమణ్యం(31) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,921 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,141 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్: ఓ వ్యక్తిపై మారణాయుధంతో దాడిచేయడమే కాకుండా అతనిని కులంపేరుతో దూషించిన కేసులో తిరుపతి కొర్లగుంటకు చెందిన సయ్యద్‌మీర్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 5వ తేదీ తిరుపతి రూరల్ పద్మావతీపురం జెడ్పీ హైస్కూల్ వద్ద నిందితుడు మీర్ తిరుపతి రూరల్ పేరూరు విద్యానగర్‌కు చెందిన వై.ప్రణీత్‌పై మారణాయుధంతో దాడిచేసి కులంపేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు దర్యాప్తు చేసి సయ్యద్‌మీర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

నిబద్ధత ఉంటే పదవులు వస్తాయి

- నారా లోకేష్ పాదయాత్రకు జనం కరువు
- జగనన్న పథకాలే మాకు ఓటుబ్యాంకు
- సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: వైఎస్సార్‌సీపీలో నిబద్ధత కలిగిన కార్యకర్తలను ఎప్పటికీ వదులుకోమని, వారు ఆశించకపోయినా, ఇంటి తలుపు తట్టి పదవులిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట పార్టీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం మండల స్థాయి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 40ఏళ్లలో జరగని అభివృద్ధి తాను మూడేళ్లలో చేసి చూపానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు గుర్తుచేశారు. అయితే ఇటీవల నియోజకవర్గంలో నారా లోకేష్ పాదయాత్ర చేస్తూ తనపై అర్థరహిత ఆరోపణలు చేశారన్నారు. ఆ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తుకు తాను సిద్ధమని సవాలు చేసినా ఆయన పిరికిపందలా పారిపోయారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు పాదయాత్ర చేస్తుంటే పట్టుమని పది మంది కూడా లేకపోవడం చూసి, ప్రజలు నవ్వుకున్నారన్నారు. శ్రీకాళహస్తిలో 21 కిలోమీటర్ల కొండ చుట్టు ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని వివరించారు. రేణిగుంటలో రూ.15కోట్లతో తెలుగుగంగ కాలువ నుంచి రెండవ పైపులైను ద్వారా తాగునీరందించి శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో వచ్చి కలవాలని కోరారు. నవరత్నాల ద్వారా జగనన్న ప్రత్యేక ఓటు బ్యాంకును సృష్టించారని, 2024లోనూ 175స్థానాల్లో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు.

బీసీల రాజ్యాధికారం జగనన్నతోనే సాకారం

బీసీలకు సామాజిక, రాజకీయ సుస్థిరత కోసం 72ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా, జగనన్న మాత్రమే బడుగులకు అగ్ర తాంబూలం ఇచ్చారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. బీసీలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటుబ్యాంకులాగా వాడుకుని గాలికొదిలేశాయని, అయితే జగనన్న మాత్రమే బీసీలు, బడుగులు, నిమ్న వర్గాలకు అండగా నిలబడ్డారని చెప్పారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ బీసీలు, అట్టడుగు వర్గాల ప్రజలు జగనన్నకు మద్దతుగా నిలిచి ఆయనకు 175 స్థానాలు అందించి, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత రాష్ట్ర ప్రజానీకానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ టి.సంధ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ గదిని పరిశీలిస్తున్న మండల ఎన్నికల అధికారి శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గదులను గురువారం మండల ఎన్నికల అధికారి, డిప్యూటీ తహసీల్దారు శివయ్య పరిశీలించారు. వారు మాట్లాడుతూ 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం ఓటు వేయటానికి పోలింగ్ బూత్‌కోసం అన్ని సౌకర్యాలు ఉన్న గదులను పరిశీలించామని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో ఎన్నికల సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఉండే గదులను పరిశీలించినట్లు వివరించారు. గదులకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యం పరిశీలించి, వివరాలను జిల్లా ఎన్నికల అధికారులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్ఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా పుచ్చ పంట





కోవూరుపాడులో సాగవుతున్న పుచ్చ పంట (ఇన్‌సెట్) పుచ్చ తోటల్లో లారీలకు లోడ్ అవుతున్న పుచ్చకాయలు

వరదయ్యపాళెం: మండలంలో ఈ ఏడాది విస్తారంగా పుచ్చ పంట సాగుకు రైతులు మొగ్గు చూపారు. ఆ మేరకు ఆశించిన స్థాయిలో పంట దిగుబడి, పంటకు గిట్టుబాటు ధర రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా వెంగారెడ్డికండ్రిగ, చెన్నవారిపాళెం, పెద్ద పాండూరు, కోవూరుపాడు, పాదిరికుప్పం, శ్రీహరికోటకాలనీ, తొండూరు, ఎంజీనగర్ ప్రాంతాల్లో పుచ్చ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరా పంటకు 15 టన్నులకు పైగా దిగుబడి రావడం, టన్నుకు రూ. 10వేల నుంచి రూ. 13వేల వరకు ధర రావడంతో రైతు ఇంట పంట పండింది. కాయ నాణ్యతను బట్టి ధరలు ఉండడంతో పుచ్చ పంట రైతులకు లాభాలను అందించింది. ప్రస్తుత వేసవికి పుచ్చకాయలకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో వ్యాపారులు పొలం వద్దకు క్యూ కడుతున్నారు.

తాగునీరు కలుషితం.. ప్రబలిన విష జ్వరాలు



తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పాయ్య గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితమై గ్రామస్తులు విష జ్వరాల బారిన పడుతున్నారు. నెల రోజులుగా ఇలా జ్వరాలతో బాధపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ ఇటువైపు రావడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

మండలంలోని కొన్నలి గ్రామంలో ఐదు రోజుల క్రితం తాగునీటిబోరు మరమ్మతులకు గురైంది. స్థానికులు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి దృష్టికి తెలియజేయగా వెంటనే స్పందించిన ఆమె తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలని అధికారులకు తెలియజేశారు. కొన్నలి ఇన్‌చార్జి వెంగళరావు పనులు పూర్తి చేసి గ్రామానికి తాగునీరు అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులు వెంటనే చేయడంతో ఆమెను గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు నైపుణ్య బోధన అవసరం



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న శివశంకర్

సత్యవేడు: పాఠశాలలో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన బోధన అందించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్ తెలిపారు. ఆయన గురువారం ఎంఈఓ రవితో కలసి మండలంలోని అమాసరెడ్డి కండ్రిగ పాఠశాలను పరిశీలించారు. 90 రోజులుగా అమలు చేస్తున్న 'టీచింగ్ అట్‌ద రైట్ లెవల్' కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థులు తప్పులు లేకుండా చదవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలిచారు. మెనూ ప్రకారం వండి వడ్డించాలని సూచించారు. అంతకు ముందు భవిత సెంటర్‌ను పరిశీలించారు. ఎంఈఓ కార్యాలయంలో టీచింగ్ స్టూల్ కార్యక్రమంపై మండల స్థాయిలో సీఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీలు చెంగమ్మ, రామారావు, బాలకృష్ణ, కుమార్, మునస్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్‌-చానల్ మోసగాడు అరెస్టు

తిరుచానూరు(చంద్రగిరి): యూ ట్యూబ్ చానల్ పేరుతో పలు మోసాలకు పాల్పడడమే కాకుండా ఓ వ్యక్తిని హత్యచేసేందుకు యత్నించిన వ్యక్తిని తిరుచానూరు పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం విద్యానగర్‌కు చెందిన ప్రణీత్ అనే యువకుడు, తిరుపతి కొర్లగుంటకు చెందిన సయ్యద్ మీర్ అనే వ్యక్తి వద్ద ఓ యూట్యూబ్ చానల్‌కు ఎండీగా నెలకు రూ.3.5 లక్షల జీతంతో విధుల్లో చేరాడు. కొన్నాళ్లకు మీర్ అనే వ్యక్తి కొంతమంది పెద్దల పేర్లు చెప్పి పలు మోసాలకు పాల్పడుతుండడంతో తనకు చెడ్డ పేరు వస్తుందని గ్రహించి ప్రణీత్ ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఈ క్రమంలో మీర్ తనకు బకాయిపడ్డ రూ.4.5 లక్షల వేతనాన్ని ఇవ్వాలని పలుమార్లు కోరినా ఇవ్వకపోవడంతో, అంతర్జాతీయ మానవహక్కుల పరిరక్షణ కమిషన్ ఫౌండర్ ముజిహుద్దీన్, జాతీయ అధ్యక్షుడు షోయాబ్‌లకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐహెచ్‌ఆర్‌సీ సభ్యులు అనంతపురంలోని కార్యాలయంలో పంచాయతీ చేసి రూ.3.7 లక్షలు ఇచ్చేట్టుగా తీర్మానం చేశారు. దీంతో మీర్ పలు దఫాలుగా రూ.1.5 లక్షలను చెల్లించాడు. మిగిలిన నగదును ఇవ్వాలని ప్రణీత్ పలుమార్లు కోరినా ఇవ్వకుండా తరచూ ఇబ్బందులు పెడుతూ వచ్చేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన మీర్‌ను నగదు కోరడంతో తనతో వస్తే ఇస్తానని చెప్పి, పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్ సమీపంలో ప్రణీత్‌పై మీర్ కత్తితో దాడికి యత్నించడంతో పాటు కులం పేరుతో దూషణలకు దిగాడు. ప్రణీత్ గట్టిగా కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి మీర్ అక్కడ నుంచి పారిపోయాడు. అనంతరం తన కుటుంబ సభ్యులు, బంధువుల సాయంతో గత సోమవారం తిరుచానూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో సయ్యద్‌మీర్‌ను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తిరుచానూరు పోలీసులు గురువారం తెలిపారు.

అఖండ విజయం అందించాలి



శ్రీకాళహస్తి : ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు



కళత్తూరు: పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆయన శ్రీకాళహస్తిలోని 1, 6, 7, 8 వార్డుల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న బలపరచిన శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా పట్టభద్రుల వాణిని శాసనమండలిలో వినిపించవచ్చన్నారు. ప్రతి ఒక్కరికీ బ్యాలెట్ నమూనా పత్రాలతో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ ఆప్కో డైరెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మిద్దెల హరి, లోకేష్ యాదవ్, పగడాల రాజు, పసల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: వైఎస్సార్ సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం కోరారు. ఆయన గురువారం మండలంలోని పాగాలిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న చేస్తున్న అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, సర్పంచ్ రాజేశ్వరి, పార్టీ నాయకులు దామోదరంరెడ్డి, గెరటారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రంగారెడ్డి, ఎం.సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జగనన్న సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌చార్జి (జేసీఎస్) భక్తవత్సలం కోరారు. మండలంలోని కాసారం సచివాలయం పరిధిలోని కాసారం, గొట్టిపూడి,కొండరాజుపల్లి, రాంబట్లపల్లి గ్రామాలలో గురువారం ప్రచారం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి కేతినేని వెంగళరావు, కాసారం సర్పంచ్ మునెమ్మ, సచివాలయం కన్వీనర్ సురేష్ రెడ్డి, పాయ్య సర్పంచ్ మణి, మాజీ సర్పంచ్ బాబు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

కేవీబీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి వేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం కళత్తూరులో గురువారం పర్యటించారు. అనంతరం స్థానిక సచివాలయంలో ఆయన పట్టభద్రులతో సమావేశమై మాట్లాడారు. శ్యామ్ ప్రసాద్‌రెడ్డి బ్యాలెట్ నమూనాలను పట్టభద్రులకు పరిచయం చేసి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సరస్వతి, నాయకులు నందకుమార్, లాల్‌బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

పిచ్చాటూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి మద్దతుగా నాగలాపురం మండలంలో కాళంజేరి, క్రిష్టాపురం పంచాయతీలో పార్టీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలియార్, సర్పంచ్‌లు మహేంద్రన్, వడివేలు, నాయకులు శ్యామ్, దేశన్, దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

వరదయ్యపాళెం: ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఆయన గురువారం మండలంలోని కడూరు గ్రామ పంచాయతీలో ఓటర్లకు బ్యాలెట్ నమూనాను అందజేసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ చిన్నా, సేవాదళ్ మండల కన్వీనర్ నానిరెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, స్థానిక సర్పంచ్ సుజాత, సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సత్యవేడు: మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ బి.సోమశేఖర్, మాస్టర్‌స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి కలసి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సత్యవేడులో బీసీ కాలనీ, విడోస్ కాలనీ, ఎస్టీ కాలనీల్లో ఓటర్లను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పునిదకుమార్, ఎంపీరవి, మస్తానీ, మునివేలు, ఈశ్వరయ్య, మాణిక్యం, కృష్ణయ్య, నరేష్, చిన్నబ్బ, ప్రభాకర్ ఆచ్చారి, రమేష్, రాబిన్ తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటికే తొలి ప్రాధాన్యత ఓటు

బుచ్చినాయుడుకండ్రిగ: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి కోరారు. ఆయన గురువారం కాంపాళ్లెం, కుక్కంబాకం, గాజులపెళ్లూరు, గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నలగోపాల్‌రెడ్డి, ఉగ్గ మూడిగురునాథం, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు మునిరాజా, నాయకులు సుబ్రమణ్యం, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్లకు కరపత్రాల పంపిణీ

నారాయణవనం: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం సాయంత్రం ఓటర్ల ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. వీరిలో మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎంపీపీ దివాకర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఉరప్ప, వైస్ ఎంపీపీ శివశంకర్, వీకే పాళ్యం సర్పంచ్ ధర్మలింగం, నాయకులు అన్నాదురై, మనోహర్, ఢిల్లీ బాబు, మోహన్, పెరుమాళ్, సారకాయలు పాల్గొన్నారు.



నాగలాపురం మండలం, కాళంజేరిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వరదయ్యపాళెం మండలం, కడూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



సత్యవేడు బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి



నారాయణవనంలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు